క్లుప్తంగా

16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 16మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిని అదుపులోకి తీసుకొని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం రాష్ట్ర మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన కొనసాగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావును కలిసిన ప్రజాప్రతినిధులు



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

మునిపల్లి(అందోల్): ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి మాజీ మంత్రి హరీశ్‌రావును బుధవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సహజమేనన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఎంతైన ఉందని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, శివశంకర్, నారాయణ, భాస్కర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు పాదయాత్ర

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని సాధించటంతో బీఆర్ఎస్ నాయకులు జిన్నారం నుంచి ఏడుపాయల వనదుర్గామాత దేవాలయానికి పాదయాత్రగా బుధవారం తరలివెళ్లారు. ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నీలం మోహన్, రమేశ్, గోపీగౌడ్, భిక్షపతిగౌడ్, బ్రహ్మేందర్ తదితరులు ఏడుపాయలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

వైభవంగా పోలి పాడ్యమి



నీటిలో దీపాలు వదులుతున్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: కార్తీకం ముగింపు సందర్భంగా బుధవారం తెల్లవారుజామున రామలింగేశ్వర దేవాలయంలో నేతితో ముంచిన వత్తులతో అరటి దుప్పలతో భక్తులు దీపాలు వెలిగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి సంపులు విడిచి పోలికి వీడ్కోలు పలికారు. ఆలయ అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో సంఘం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ శరత్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు గాను శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి శ్రీనివాస్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం కార్పొరేటర్ పుష్ప కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. నిధులు మంజూరైన తర్వాత నూతనంగా అభివృద్ధి పనులు చేపడుతామని వివరించారు.

యథేచ్ఛగా గ్యాస్ రీఫిల్లింగ్

- గుట్టుచప్పుడు కాకుండా అక్రమ దందా
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ఇటీవల బొల్లారంలో గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న స్పెషల్ టీం అధికారులు(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): గ్యాస్ రీఫిల్లింగ్ దందాను గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గ్యాస్‌ను రీఫిల్ చేస్తున్న సమయంలో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తోంది. డొమెస్టిక్ సిలిండర్లలో ఉన్న గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలోకి నింపుతూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పటాన్‌చెరులోని పారిశ్రామిక వాడల్లో ఏళ్ల తరబడి ఈ దందా కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు, జిన్నారం, హత్నూర పారిశ్రామికవాడల్లో గ్యాస్ రీఫిల్లింగ్ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. పారిశ్రామికవాడల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తుంటారు. వీరి అవసరాన్ని ఆసరా చేసుకొని కొంతమంది అక్రమార్కులు గ్యాస్‌ను రీఫిల్ చేస్తూ చిన్న గ్యాస్‌సిలిండర్లను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు.

లాభార్జనే లక్ష్యంగా..

డబ్బులను అర్జించటమే లక్ష్యంగా అక్రమార్కులు నిబంధనలను సైతం పట్టించుకోకుండా కమర్షియల్ సిలిండర్‌లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్యాస్‌ను రీఫిల్ చేస్తున్న సమయంలో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల బొల్లారం మున్సిపల్ పరిధిలో గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై ఎస్పీ రూపేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 72 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

నామమాత్రంగా చర్యలు..

గతంలో పౌరసరఫరా, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు నిర్వహించి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కానీ.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి గ్యాస్ రీఫిల్లింగ్‌ను పూర్తిగా నివారించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **కఠినంగా వ్యవహరిస్తున్నాం**
>
> గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై తరచూ దాడులు నిర్వహిస్తున్నాం. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గ్యాస్ రీఫిల్ చేసిన సిలిండర్లను వినియోగదారులు కొనుగోలు చేయొద్దు. రీఫిల్ చేసిన సిలిండర్లను కొనుగోలు చేయటం ద్వారా ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> – సుజాత, పౌరసరఫరా శాఖ అధికారి, సంగారెడ్డి

పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలి

- రామదూత జిన్నింగ్ మిల్‌పై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి



మాట్లాడుతున్న యాదవరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బోరబట్ల, చందపూర్ గ్రామ శివారులోని రామదూత జిన్నింగ్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ రైతుల వద్ద సీసీఐ ద్వారా కాకుండా ప్రైవేట్‌లో పత్తి కేవలం రూ. 6,400, 6,500 చొప్పున కొనుగోలు చేస్తున్న రామదూత జిన్నింగ్ మిల్లు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో పత్తి వేసుకున్నట్లు చూపించడంలేదన్నారు. కనీస మద్దతు ధర రూ. 7,020 ఇవ్వాలన్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని రామదూత జిన్నింగ్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రామాంజనేయులు, నరసింహారెడ్డి, నరేందర్, మైసయ్య, కృష్ణ, నర్సింహులు, పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను పెంపొందించండి

ఎంఈఓ దండు అంజయ్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ దండు అంజయ్య సూచించారు. బుధవారం పట్టణ పరిధిలోని సిద్ధపూర్ ప్రాథమిక పాఠశాల, తెలుగు మీడియం, సిద్ధాపూర్ కాలనీలోని ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలను ఎంఈఓ దండు అంజయ్య తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకం వర్క్‌బుక్, అలైన్‌మెంట్ ప్రకారం బోధన సాగించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, రజనీ, అస్పాక్, ఉపాధ్యాయులు సీఆర్పీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన



అన్నారంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు



కంది చౌరస్తాలో..

కంది(సంగారెడ్డి): ప్రభుత్వం తమకు ప్రతినెల డబ్బులు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ ఆటోడ్రైవర్లు కంది చౌరస్తాలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటోయూనియన్ అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ తగ్గిందన్నారు. దీంతో ఆటోల ఈఎంఐలు చెల్లించడం ఇబ్బందిగా మారిందని వాపోయారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిబ్, సతీశ్‌గౌడ్, రాజు, మల్లేశం, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని నిరసిస్తూ ఆటోడ్రైవర్‌లు గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, అన్నారం ప్రధాన రహదారులపై బుధవారం ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆటోడ్రైవర్‌లతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ప్రభుత్వం స్పందించేవరకూ ఉద్యమిస్తాం

- కమలేశ్‌చంద్ర కమిటీ సిఫారసులు అమలుచేయాలి
- రెండో రోజుకు పోస్టాఫీస్ ఉద్యోగుల సమ్మె
- డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్



సంగారెడ్డిలో ధర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేవరకూ ఉద్యమిస్తామని గ్రామీణ ప్రాంత పోస్టాఫీస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని పోస్టాఫీసు ఎదుట రెండవ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు. గ్రూపు ఇన్సురెన్స్ రూ.5 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. జీడీఎస్, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని తెలిపారు. కమలేశ్‌చంద్ర కమిటీ సిఫారసు చేసిన బన్చింగ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్‌బీఏన్‌కు జీడీఎస్ కంట్రిబ్యూషన్ 10 శాతం, డిపార్టుమెంట్ 10శాతం కంట్రిబ్యూషన్ ఇవ్వడంతో పాటు తాత్కాలిక పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. టార్గెట్స్ మేళాల రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వేధింపులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాలశాఖ ఉద్యోగులు రాజేందర్‌రెడ్డి, వీరేశం, గోపికృష్ణ, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు సమ్మె..

జహీరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారంతో రెండో రోజుకు చేరింది. జహీరాబాద్‌లోని సబ్ డివిజన్ పోస్టాఫీసు వద్ద ఉద్యోగులు టెంట్ వేసుకుని సమ్మెలో పాల్గొన్నారు. 8 గంటల పని సమయం, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలనే డిమాండ్‌తో పాటు 11 ప్రధాన డిమాండ్లతో సమ్మెకు దిగారు. దీంతో ఉత్తరాల బట్వాడాలో జాప్యం జరుగుతోంది. డిమాండ్లను సాధించుకునేవరకు దశలవారీగా ఆందోళనలను నిర్వహిస్తామని ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి సుల్తాన్ పేర్కొన్నారు.



జహీరాబాద్‌లో..



సంగారెడ్డిలో..

సంగారెడ్డిలో..

తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 2వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి డివిజన్ రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వీరేశం, ఓంప్రకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. 'ఆరోగ్యశ్రీ'

- కవరేజీ రూ.5 నుంచి 10లక్షలకు పెంపు
- 3.7లక్షల కుటుంబాలకు ప్రయోజనం



ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ శరత్ (ఫైల్)

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పొందే ప్రయోజన పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఈ పథకం నిరుపేదలకు వరంగా మారింది. రోజురోజుకూ వైద్యం అత్యంత ఖరీదుగా మారుతుండటంతో పేదలు చికిత్స చేయించుకోలేని దుస్థితి నెలకొంది. ఇదివరకు వైద్యం చేయించుకునేందుకు ముందుకు వచ్చేవారు ఆస్తులు అమ్ముకొని, అప్పులు చేయాల్సి వచ్చేది. ఉమ్మడి ఏపీలో ఈ పరిస్థితిని గమనించిన మాజీ సీఎం దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి 2007 ఏప్రిల్ 1న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. అప్పటివరకు కార్పొరేట్ ఆస్పత్రుల దరిదాపుల్లోకి కూడా వెళ్లని పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం కలిగింది.

అందుబాటులో ఖరీదైన వైద్యం..

వివిధ పేర్లతో ఈ పథకం పలు రాష్ట్రాల్లో అమలవుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్ కింద రూ.5లక్షల వరకు వైద్యసేవలు పొందే వీలుంది. రాష్ట్రంలో 293 ప్రైవేట్ ఆస్పత్రులు, 198 ప్రభుత్వ పెద్దాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద 1,376 శస్త్ర చికిత్సలు, 289 వివిధ రకాల వైద్య సేవలను అందిస్తున్నారు. ఆయుష్మాన్‌భారత్‌కింద 1,949 వ్యాధులకు వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్‌లో ఈ రెండింటిలో ఉన్న వైద్య సేవలను అమలు చేస్తున్నారు.

ఆహారభద్రత కార్డు ఉంటే చాలు

ఆరోగ్యశ్రీ పథకం కింద సంగారెడ్డి జిల్లాలో 3,78,598 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. ఆహార భద్రత కార్డు కలిగిన వారందరూ అర్హులే. ఆయుష్మాన్‌భారత్ పథకానికి కూడా ఇంతే. ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం ద్వారా ఖరీదైన చికిత్సలన్నీ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా పొందవచ్చు. ముఖ్యంగా గుండె, డయాలసిస్ రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

దత్త జయంతికి తరలిరావాలి

నారాయణఖేడ్: ఈ నెల 23 నుంచి 27వరకు కర్ణాటకలోని మాణిక్‌నగర్‌లో దత్త జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మాణిక్‌నగర్ సంస్థాన్ పీఠాధిపతి జ్ఞానరాజ్ మహారాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది తరహాలో ఈ సంవత్సరం కూడా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న ప్రభువులవారి 258వ పుణ్యతిథి, 24న ప్రభు ద్వాదశి, 25న గురుపూజ, 26న ప్రభువుల వారి 206వ జయంతి, 27న దర్బార్ ఉంటుందన్నారు.

భూములను స్వాధీనం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, బి.శ్రీనివాస్‌గౌడ్, కె. శ్రీనివాస్‌గౌడ్, నరేశ్ అన్నారు. బుధవారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని కొంతన్‌పల్లి, గుండ్లపల్లి, సికింద్లాపూర్, శభాష్‌పల్లి, ఎదుల్లాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు భూములు, అసైన్డ్ చేసిన భూములను బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకొని అమ్మకాలు చేపట్టారన్నారు. అన్యాక్రాంతం చేసిన భూములను కాపాడాలని కోరుతూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

సంగారెడ్డి: పట్టణంలోని జీజేఆర్ గార్డెన్‌లో అయ్యప్పస్వాములు మహా పడిపూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. కర్దనూర్ విష్ణువర్ధన్ గురుస్వామి ఆధ్వర్యంలో 18 కలశాలతో ప్రత్యేక పూజలు చేశార. కార్యక్రమంలో స్వాములు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా హరినామ సప్తహా

నారాయణఖేడ్: పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయంలో బుధవారం అఖండ హరినామ సప్తహా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మహారాజ్ నిర్వహించిన కీర్తన విశేషంగా ఆకట్టుకుంది. అంతకుముందు ఆలయంలో అభిషేకం, హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

ఈకేవైసీ కోసం బారులు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్యాస్ సిలిండర్ కోసం ఈకేవైసీ చేయించుకోవాలని జనం బారులు తీరారు. బుధవారం కౌడిపల్లిలోని హెచ్‌పీ గ్యాస్ డీలర్ వద్ద లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు తరలివచ్చారు. దీంతో డీలర్ వద్ద జనంతో రద్దీగా మారింది. డీలర్ పురుషోత్తంతో పాటు సిబ్బంది లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ చేశారు.

మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలపాలి



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినులు

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులు బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్‌కి వినతిపత్రం అందజేశారు. హైదరాబాదుకు దగ్గరగా ఉన్న మెదక్‌ని సిరిసిల్ల జోన్‌లో ఉంచడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీవ్రంగా నష్టపోతున్నామని విద్యార్థులు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ కలపాలని కోరారు.

కలిసి పనిచేస్తాం

గీతం అధ్యక్షుడు భరత్



సమ్మేళనంలో పాల్గొన్న సీబీఎస్ఈ సిబ్బంది, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: ఉన్నత ఆలోచనలున్న ప్లస్-2 స్కూళ్లతో కలిసి పని చేయడానికి సిద్ధం అని గీతం అధ్యక్షుడు భరత్ అన్నారు. గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన 'భారతీయ విద్యా నాయకత్వ సమ్మేళనం'ను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. తాము లిబరల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని, కలిసొచ్చే పాఠశాలలతో కలిసి పయనించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వారా విధాన నిర్ణయంలో మాస్టర్స్ ప్రోగ్రాం నిర్వహిస్తూ, ప్రపంచ స్థాయి విద్య ఆవశ్యకతను చాటి చెబుతున్నామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విద్యా సామర్థ్యాలనుపెంపొందించేందుకు అవసరమయ్యే అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈఎంఐ సర్వీసెస్ ఇండియా సహ వ్యవస్థాపకురాలు లక్ష్మీఅన్నపూర్ణ మాట్లాడారు. అనంతరం గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్‌రావు వ్యవస్థాపకులుగా విద్యార్థులు ఎదిగేందుకు గీతం చేపట్టిన పలు చర్యలను వివరించారు. వేసవిలో విద్యార్థుల కోసం ఉచితంగా సమ్మర్ స్కూల్ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి భారతదేశ నలుమూలల నుంచి వివిధ సీబీఎస్ఈ పాఠశాలలు, ఐబీ స్కూల్స్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.